## క్లుప్తంగా

### గ్రోమోర్ సెంటర్‌లో రైతు దినోత్సవం



కారెంపూడి: స్థానిక గ్రోమోర్ సెంటర్‌లో శనివారం జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా రైతులను సన్మానించారు. చింతపల్లి గ్రామానికి చెందిన పంగులూరి రామకృష్ణయ్య, గుండ్లకుంట రామారావులను గ్రోమోర్ మేనేజర్ షేక్ జాకీర్ హుస్సేన్, సిబ్బంది సన్మానించారు. వ్యవసాయ అభివృద్ధికి గ్రోమోర్ అందిస్తున్న సేవలను జాకీర్ హుస్సేన్ వివరించారు. రైతు బాగుంటేనే అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ షేక్ షఫీ, సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజా నాయక్, కొర్రపాటి మురళి తదితరులు పాల్గొన్నారు.

### చావపాడు సర్పంచ్ చిలకా ఆనందరావు మృతి



అమరావతి: మండల పరిధిలోని చావపాడు గ్రామ సర్పంచ్ చిలకా ఆనందరావు(61) గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మధ్యాహ్నం విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. 2021వ సంవత్సరంలో చావపాడు నూతన గ్రామ పంచాయతీగా ఆవిర్భవించింది. ఈక్రమంలో 2021 ఫిబ్రవరి నెలలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో చావపాడు గ్రామ సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థిగా చిలకా ఆనందరావు పోటీచేసి విజయం సాధించారు. సుమారు 34 నెలల కాలంలో గ్రామంలో పలు అభివృద్ధి జరగటానికి తనవంతు కృషి చేశారు. మంగళవారం ఆయన మృతదేహాన్ని మండల పరిధిలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

### అనంతవరంలో 'వికసిత్ భారత్ సంకల్పయాత్ర'



అనంతవరం(క్రోసూరు): దేశ ప్రజలందరి సహకారంతో భారతదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతోనే భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమ లక్ష్యంగా చేపట్టారని భారత ప్రభుత్వ జాతీయమత్స్యశాఖ విశాఖపట్నం ప్రతినిధి పాపారావు అన్నారు. మండలంలోని అనంతవరంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాపారావు పాల్గొని మాట్లాడారు. గ్రామ సర్పంచ్ పి.రామయ్య అధ్యక్షత వహించారు. ప్రజలకు అందజేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వాటిని అర్హులైన వారికి నూరు శాతం అందే విధంగా సంకల్ప యాత్ర ఉద్దేశ్యమని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొని 17 రకాల కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. వైద్యాధికారి సిరి చందన ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రైతులు ఎరువుమందు చల్లే డ్రోన్ ఉపయోగించే విధానం గూర్చి వ్యవసాయశాఖ అధికారులు వివరించారు. ఎంపీడీఓ మహేష్, సర్పంచ్ రామయ్య, ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్, ఎంపీటీసీ వేణుగోపాల రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షేక్ షాహిదా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు .

### కౌలు రైతు ఆత్మహత్య

మాచవరం: పురుగు మందు తాగి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రాయపాటి ఏసుదాసు (35) సుమారు రూ.3లక్షల వరకు అప్పులు కావడంతో, అప్పులు తీర్చలేననే మనస్థాపంతో శుక్రవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కి తరలించగా, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి ముగ్గురు సంతానం. మృతుని భార్య ఏసమ్మ ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### జాతీయస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఏఎంజీ విద్యార్థి

చిలకలూరిపేట: ఏఎంజీ హైస్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థి పిడుగురాళ్ల సాంబశివరావు జాతీయ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నరసరావుపేటలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ అండర్ -19లో పోల్‌వాల్ట్ విభాగంలో రజిత పతకం సాధించాడు. దీని ద్వారా మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి సాంబశివరావును ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్ కుమార్ మహంతి, స్కూల్ హెచ్‌ఎం కృపాదానం, పీఈటీలు రాజు, రాజేష్ తదితరులు అభినందించారు.

# భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

- కిటకిటలాడిన ఆలయాలు
- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు



చెన్నకేశవస్వామి దర్శనం



పిన్నెల్లిలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేద పండితులు

కారెంపూడి: ముక్కోటి ఏకాదశి సందర్భంగా కారెంపూడిలో చెన్నకేశవస్వామి ఉత్తర ద్వారం ద్వారా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 3 గంటల నుంచే స్వామివారి దర్శనం ప్రారంభమైంది. వేలాదిగా భక్తులు చెన్నకేశవస్వామిని పక్కనే ఉన్న బ్రహ్మనాయుడు ఆయుధం నృసింహకుంతాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు కొమండూరి సత్యనారాయణాచార్యులు భక్తుల పేరుతో అర్చనలు చేసి తీర్థం అందించారు. స్వామి వారి దర్శనం కోసం తరలివచ్చిన భక్తులకు దేవదాయశాఖ ఈఓ కృష్ణంరాజు, ఆలయ కమిటీ చైర్మన్ చల్లా వీర్లవరప్రసాదరావులు ప్రసాదంగా పులిహోర, పాయసం పంపిణీ చేశారు. పల్నాటి వీరాచార పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ స్వయంగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఇదిలా ఉంటే మండలంలోని అన్ని దేవాలయాలలో ఉత్తరద్వార దర్శనాలు జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివార్లనే దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**విజయపురిసౌత్‌లో...**

విజయపురిసౌత్: వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం విజయపురిసౌత్‌లో ఘనంగా నిర్వహించారు. సీతారామాలయం, కృష్ణుని దేవాలయంతో పాటు పలు ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు, రోహిత్ పాండే ఆధ్వర్యంలో ఆయా దేవాలయాలలో స్వామి వారికి పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**మాచవరంలో...**

మాచవరం: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా దేవాలయాల్లో స్వామి వార్లు ప్రత్యేక అలంకరణలతో భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లోని ప్రజలు ఉపవాస దీక్షలు చేపట్టి, తల స్నానాలు ఆచరించి దేవాలయాలకు వెళ్లి దేవుళ్లను దర్శించుకొని పూజలు నిర్వహించారు. తమను పాడి, పంట, సుఖ, సౌభాగ్యాలతో చల్లగా కాపాడాలని వేడుకున్నారు. పలు గ్రామాల్లో వేదపండితులు వేద మంత్రాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ముక్కోటి ఏకాదశి నాడు ఉత్తర ద్వార దేవాలయాల దర్శన విశిష్టతను ప్రజలకు తెలియజేశారు.

**అభయ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో..**



చెన్నకేశవుని దర్శించుకుంటున్న భక్తులు



సీతారామాలయంలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు బ్రహ్మాచార్యులు

పిడుగురాళ్ల: పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద గల అభయ ప్రసన్నాంజనేయ స్వామివారి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు హాజరై స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆలేటి మల్లిఖార్జునరావు, ప్రధాన కార్యదర్శి మద్దాళి సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

### మానవత్వం చాటుకున్న హెచ్‌ఎం



పిడుగురాళ్ల: తన పాఠశాలలోని విద్యార్థి రోజు నడవలేక పాకుకుంటూ పాఠశాలకు వస్తుండటంతో గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగాల ధనలక్ష్మి ట్రైసైకిల్ అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుకునే యోహాన్ అనే విద్యార్థి రోజు పాఠశాలకు నడవలేని పరిస్థితుల్లో ఉండటంతో పాకుకుంటూ, మరొకరి సహాయంతో పాఠశాలకు వస్తుండటంతో గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగాల ధనలక్ష్మి తన వంతు సాయం చేయాలన్న సంకల్పంతో సొంత డబ్బులతో విద్యార్థికి ట్రైసైకిల్ కొనుగోలు చేసి శనివారం పాఠశాలలోని విద్యార్థికి అందజేశారు. హెచ్‌ఎం పిలిచి ట్రైసైకిల్ బహూకరించటంతో విద్యార్థి ఆనందంతో ఉబ్బితబ్బిబయ్యాడు.

### నేడు చినకంచర్లలో ఉచిత వైద్య శిబిరం

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో ఎంపీపీ స్కూలు ప్రాంగణంలో అమ్మ డిజిటల్ ఫెక్స్ ప్రింటింగ్ వారి సారథ్యంలో హెల్త్ హస్పిటల్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నేడు నిర్వహించుతున్నట్లు కమిటి సభ్యులు పాపసాని సురేష్ తెలిపారు. అవసరమైన వారికి ఉచితంగా యాంజియోగ్రామ్ పరీక్షలు చేస్తారన్నారు.

## నేడు ఇళ్లపట్టాలు పంపిణీ

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే కాసు



దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ కాలనీలో 1320మంది నిరుపేదలకు ఆదివారం ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంకు సంబంధించిన ఏర్పాట్లను ఎమ్మెల్యే కాసు స్వయంగా పరిశీలన చేసి అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. వలంటీర్ల వారీగా లబ్ధిదారులను సభలో కుర్చొబెట్టాలని, నేరుగా తానే లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చేలా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. సభకు వచ్చే లబ్ధిదారులకు భోజనం, తాగునీటి వసతులు కల్పించాలని, సభ ముగిసిన తరువాత క్షేమంగా ఇంటికి చేరుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యే కాసు సూచించారు. ఎమ్మెల్యే కాసు వెంట నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, కమిషనర్ వేల్పూరి సత్యనారాయణ, తహసీల్దార్ గుజ్జర్లపూడి కరుణకుమార్, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ, వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌భాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్ సత్తార్, యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు షేక్ సుభాని, కోట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్‌హుస్సేన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కో-ఆప్షన్ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### క్రీడల్లో సత్తాచాటిన గిరిజన గురుకుల విద్యార్థినులు



కారెంపూడి: స్థానిక గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థినులు జోన్-3 స్కూల్ గేమ్స్, స్పోర్ట్స్‌లో ఓవరాల్ చాంపియన్ షిప్‌తో పాటు ఇండివిడ్యువల్ చాంపియన్‌షిప్‌లను కూడా సాధించారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ వి.రమేష్‌బాబు శనివారం తెలిపారు. యర్రగొండపాలెంలో 22వ తేదీవరకు జరిగిన జోన్-3 క్రీడల్లో చాంపియన్ షిప్ సాధించిన విద్యార్థినులను పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఖోఖోలో ప్రథమ స్థానం, వాలీబాల్‌లో మూడవ స్థానంలో నిలవడంతో పాటు 100 మీటర్లు, అలాగే 200, 400, 800 మీటర్ల పరుగులో పాఠశాల విద్యార్థినులు ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారని పేర్కొన్నారు. విజేతలలో ఐ.వర్షిణి, ఆర్.ప్రమీల, ఆర్.పవిత్ర, బి.గంగోత్రి ఉన్నారు. వారికి శిక్షణ ఇచ్చిన పీఈటీ ప్రమీలను ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు సన్మానించారు.

## విద్యతోనే బంగారు భవిష్యత్తు



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిన ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ ఉదయకుమారి రమేష్

రెంటచింతల: సమాజంలోని పేద విద్యార్థులకు విద్యతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందనే ప్రగాఢ విశ్వాసంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను ఉచితంగా అందజేస్తున్నట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని జెట్టిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, సర్పంచ్ దావులూరి ఉదయ కుమారి రమేష్, పార్టీ నాయకులతో కలసి ట్యాబ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలోని పేదల పిల్లలకు నాణ్యమైన విద్య దూరమైన విషయాన్ని గమనించిన సీఎం జగన్ వారికి మంచి చదువులు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇందులో భాంగా నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ, ఎన్నో పథకాలను అమలుచేస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. డీడీఓ, మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ యార్ల మహాలక్ష్మి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో ఇప్పటివరకు అమలుచేయని పథకాల ద్వారా ముఖ్యమంత్రి విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులకు సీఎం జగన్ ఆత్మబంధువుగా మారి వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. ఎంఈఓ-2 శివనాగేశ్వరరావు, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

## లోక పాపపరిహారార్థం క్రీస్తు జననం



కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న దృశ్యం

కేసానుపల్లిలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

దాచేపల్లి: సర్వమానవాళిని పాపము నుంచి రక్షించేందుకు ఏసుక్రీస్తు భూలోకంలో జన్మించారని, క్రీస్తును ఆరాధించటమే నిజమైన క్రిస్మస్ అని పాస్టర్ గనుపల్లి శ్యాం ప్రసన్నకుమార్ అన్నారు. మండలంలోని కేసానుపల్లి క్రీస్తు లూథరన్ దేవాలయంలో శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. క్రిస్మస్ కేక్‌ని కట్ చేసి పంపిణీ చేశారు. సండేస్కూల్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాస్టర్ ప్రసన్నకుమార్ మాట్లాడుతూ క్రీస్తు జననం ద్వారా లోకంలోని ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నిండాయని, క్రీస్తుని ఆరాధించటం ద్వారా పాపక్షమాణ దొరుకుతుందన్నారు. సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు, ఎంపీటీసీ చెట్టిపోగు ఏసుదాసు, ఏఈఎల్‌సీ డేలిగేట్ వినుకొండ బాబు, చర్చి డేలిగేట్ శ్రీపతి కాశయ్య, మాజీ సర్పంచ్‌లు చెట్టిపోగు అంకయ్య, వినుకొండ మాణిక్యరావు, వినుకొండ సుధీర్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వినుకొండ పెదజాను, సంఘ పెద్దలు, స్త్రీల సమాజం స్త్రీలు, సండే స్కూల్ చిన్నారులు, సంఘ యువత పాల్గొన్నారు.

**క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు**



విద్యుత్ దీపాల అలంకరణలో ఇరికేపల్లి తెలుగు బాప్టిస్ట్ చర్చి

దాచేపల్లి: క్రిస్మస్ పండుగ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. ఏసుక్రీస్తు జన్మదినం పురస్కరించుకుని ప్రతి ఏటా డిసెంబర్ 25న క్రిస్మస్ పండుగను జరుపుకొంటారు. ఇప్పటికే క్రీస్తు పుట్టుక గురించి ప్రజలకు తెలియజేసేందుకు సెమీ క్రిస్మస్ వేడుకలు మండల వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. సోమవారం క్రిస్మస్ పండుగ నేపథ్యంలో పలు చర్చిలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అంలకరణ చేశారు. చర్చి పరిసరాలను శుభ్రం చేయించారు. అదేవిధంగా క్రైస్తవులు తమ గృహాలను సైతం అందంగా అలంకరణ చేసి, ఇప్పటికే గృహంపై స్టార్లను ఏర్పాటు చేశారు. వీధుల మూలల్లో, చర్చిల వద్ద పెద్దపెద్ద స్టార్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే వస్త్ర దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. క్రిస్మస్ పర్వదినం రోజున ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం సమయాల్లో చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయి.

### వైద్యశాలకు వీల్‌చైర్ బహుకరణ



ఈపూరు: స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు ఈపూరు గ్రామానికి చెందిన కొప్పెర పరమేశ్వరరావు శనివారం వీల్‌చైర్‌ను బహుకరించారు. తమ తల్లి కొప్పెర సాయమ్మ జ్ఞాపకార్థం వీల్‌చైర్‌ను బహుకరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇందుకు గాను గ్రామస్తులు, వైద్యసిబ్బంది పరమేశ్వరరావును సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, వైద్యులు ప్రభాకరరావు, భాస్కరరావు, పారా మెడికల్ అసిస్టెంట్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

### పంట కోత ప్రయోగాలు

ఈపూరు : మండల కేంద్రంలో శనివారం పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతు రామనాదం సుబ్బారావుకు చెందిన వరి పొలంలో 5"5 కొలతల విస్తీర్ణంలో వరి కంకులను నూర్పగా 24.750 కేజీలు ధాన్యం వచ్చినట్లు, అదేవిధంగా యర్రం సుబ్బారెడ్డి పొలంలో పంట కోత ప్రయోగం చేయగా 19.900 కేజీలు వచ్చినట్లు మండల వ్యవసాయాధికారి రామారావు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

పిడుగురాళ్ల: ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేద్దామని మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్ అన్నారు. పట్టణంలోని 14వ సచివాలయం పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన కిట్లతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జైలాబ్దిన్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 15 సంవత్సరాల నుంచి పై వయస్సు కలిగిన వారు క్రీడలలో నైపుణ్యం కలిగి ఉంటే వారిని వెలికి తీయాలనే మంచి ఉద్దేశ్యంతో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారని, దీనిని ప్రతి ఒక్కరు వినియోగించుకోవటం వలన వారికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సర్టిఫికెట్‌తోపాటు, నగదు పురస్కారం అందించటం జరుగుతుందన్నారు. పట్టణంలోని ఎంతోమంది యువత ఈ ఆటలో పాల్గొనేందుకు ఉత్సాహం చూపారని, ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పోటీల్లో ప్రతిఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన తెలియజేశారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

**ఆణిముత్యాలను వెలికితీయడమే లక్ష్యం..**

గురజాల: గ్రామాల్లో దాగివున్న ఆణిముత్యాలను వెలికితీయడమే ఆడుదాం.. ఆంధ్రా లక్ష్యమని నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ అన్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి వీఎంఎస్ క్లబ్ వరకు శనివారం ఆడుదాం .. ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఏకైక లక్ష్యంగా ఈ వినూత్న కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్నారన్నారు. 26వ తేదీ నుంచి క్రీడా సంబరం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఎంపీడీఓ ఆర్.ఫణికుమార్ నాయక్, నగర పంచాయతీ కమిషనర్ ఎ.మోహన్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ వేముల శేషమ్మ చలమయ్య, మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమరారెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ మన్నెం కన్యాకుమారి ప్రసాద్, చిట్టిమాల ప్రసాద్ రావు, చంద్రారెడ్డి, కార్యదర్శి వి.శివకోటేశ్వరరావు తదితరులున్నారు.

## వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా 'ఉన్నం'



ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపున్న ఉన్నం శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా యూత్ వైస్ ప్రెసిడెంట్‌గా పిడుగురాళ్ల మండలంలోని జానపాడు గ్రామానికి చెందిన ఉన్నం శ్రీనివాసరావును ఎన్నికయ్యాడు. తనకు ఈ పదవి రావటానికి కృషి చేసిన గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శనివారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఉన్నం శ్రీనివాసరావుకు దుశ్శాలువా కప్పి అభినందించారు. అలాగే పార్టీ అభివృద్ధికి మరింత కష్టపడాలని తెలియజేశారు. పార్టీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, వైస్ ఎంపీపీ గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ అల్లు సత్యవతి, పిచ్చిరెడ్డి, వైస్ ఎంపీపీ సాతులూరి బాబు, మాజీ జడ్పీటీసీ వీరభద్రునిరామిరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**యువజన విభాగం జిల్లా జనరల్ సెక్రటరీగా ఇల్లూరి**



ఇల్లూరి వెంకట్రామిరెడ్డి

పిడుగురాళ్లరూరల్: పల్నాడు జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం జిల్లా జనరల్ సెక్రటరీగా మండలంలోని కరాలపాడు గ్రామానికి చెందిన ఇల్లూరి వెంకట్రామిరెడ్డి నియమించినట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ పదవి రావటానికి కృషి చేసిన గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి వెంకట్రామిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## సర్వే రాళ్ల ఏర్పాటుకు సహకరించాలి

నరసరావుపేట ఆర్డీవో ఎం.శేషిరెడ్డి

రొంపిచర్ల : పంట భూముల్లో సర్వే రాళ్లు వేసేందుకు భూమి యజమానులు సహకరించాలని నరసరావుపేట ఆర్డీవో ఎం. శేషిరెడ్డి అన్నారు. మెగా స్టోన్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలో విప్పర్ల గ్రామంలో సర్వే రాళ్లు పాతే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఆర్డీవో శేషిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వారు జరిపిన రీసర్వే ప్రకారము రైతులకు చెందిన పొలాల్లో వచ్చిన విస్తీర్ణము ప్రకారం సర్వే రాళ్లు పాతిస్తున్నామన్నారు. పొలాల్లో సర్వే రాళ్లు వేస్తున్న సర్వే, రెవెన్యూ సిబ్బందికి రైతులు సహకరించాలని కోరారు. అనంతరం ఆ గ్రామంలో 200 సర్వే రాళ్లు పాతించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.అంకారావు, వీఆర్వో సురేష్, సచివాలయం సర్వేయర్‌లు లక్ష్మణ్, జోసఫ్, కశిరెడ్డి వెంకట కోటిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పథకాలు సద్వినియోగం చేసుకోండి

ఎంపీడీవో సీతారామయ్య



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: ప్రభుత్వ పథకాలను అర్హులైన వారంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. మండలంలోని వేల్పూరు, పోట్లూ రు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 సంక్షేమ పథకాలపై పోస్టర్‌ను అవిష్కరించారు. పీఎం కిసాన్, యోజన పథకంలో భాగంగా మండలంలోని 15 గ్రామపంచాయతీలో 5482 మంది లబ్ధిదారులకు రూ.328.92 లక్షల రూపాయాలు లబ్ధి చేకూరందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బీర్నేడి రత్నప్రభ, పోపూరి జ్యోతి, వైద్యాధికారి యం.రాధాకృష్ణన్, ఏవో పి.ప్రవీణ్, ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఏపీయం జి.వాసుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు. కుప్పం శ్రీలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ)
97053 46588 (మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com